ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

ఆదివారం 30 జూన్ 2024

బిల్లులు రాకపోతే ఎలా

● అవినాశ్ ముందు కౌన్సిలర్ల ఏకరువు

పులివెందుల, జూన్ 29: మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాలేదని, బిల్లులు రాకపోతే మా పరిస్థితి ఎలా అని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఇంటి వద్ద మున్సిపల్ కౌన్సిలర్లతో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు పాడాలో చేసిన పనుల పెండింగ్ బిల్లులపై స్పందించారు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. ఎన్నికల సమయంలో ఎంతప్రయత్నించినా బిల్లులు రాలేదని, ఇలా అయితే చేసిన అప్పులు ఎలా తీరుతాయని పలువురు కౌన్సిలర్లు అవినాశ్‌రెడ్డికి వివరించారు. అందుకు ఆయన స్పందిస్తూ ఎవరూ అధైర్యపడవద్దని, కోర్టు ద్వారా బిల్లులు వచ్చేలా చూద్దామన్నారు. అధికారపక్షం నుంచి కవ్వింపుచర్యలు ఉన్నా సర్దుకుపోవాలని వారికి సూచించారు. పార్టీ శ్రేణులు స్పందించి గొడవలకు దిగితే అనవసర కేసులకు బలికావాల్సి ఉంటుందని వివరించారు. అనవసర కేసులు నమోదైతే స్థానిక సంస్థల ఎన్నికల్లో బైండోవర్ కేసులు అని ఇబ్బందిపెట్టే అవకాశం ఉందన్నారు.

స్కౌట్స్‌తో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుంది

● అన్ని పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ తప్పనిసరి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 29: స్కౌట్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని మండిపల్లి భవన్‌లో మంత్రిని జిల్లా స్కౌట్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డితో పాటు స్కౌట్స్ విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా స్కౌట్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం పెంపొందుతాయన్నారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి స్కౌట్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరుతాయన్నారు. దీంతో పాటు విద్యార్థుల్లో మానసిక, శారీరక, దృఢత్వం ఏర్పడుతుందన్నారు. స్కౌట్ సర్టిఫికెట్ కలవారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని దానిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, గైడ్ కెప్టెన్ హేమలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.




మంత్రి మండిపల్లిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ సభ్యులు

ఫీజులుం

రోజువారి కూలి పనులతో జీవనం సాగించే వారు సైతం తమ పిల్లలను మంచి పాఠశాలల్లో చదివించాలనే ఆశయాన్ని కొన్ని ప్రైవేటు పాఠశాలలు క్యాష్ చేసుకుంటున్నాయి. నాణ్యమైన విద్యకోసం ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తే అక్కడ వసూలు చేస్తున్న ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు దడపుట్టిస్తున్నాయి. స్కూలు ఫీజులే కాకుండా విద్యార్థులకు అవసరమైన సమస్త సామగ్రి ఆయా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలి. ఐడీ కార్డులు, టై, బెల్టు, సాక్స్, షూ యూనిఫాం పుస్తకాలన్నీ అక్కడే కొనాలి. అత్యధిక శాతం పాఠశాలల్లో వీటి ధరలు 50 శాతం నుంచి 60 శాతం అదనంగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో ఆ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను అందిన కాడికి దోచుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.





● నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు

● యూనిఫాం, ఐడీకార్డు, బుక్స్ అమ్మకాలు

● రూ.20వేల నుంచి రూ.30వేలు వీటి కొనుగోలుకే

● బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

● తూతూ మంత్రంగా విద్యాశాఖాధికారుల తనిఖీలు


కడప (ఎడ్యుకేషన్)/ ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలే ఉంటాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో తాము సొంతంగా తయారు చేసుకున్న కరికులం (సిలబస్) పుస్తకాలను అమ్మకాలు జరుపుకుంటున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో విద్యతో పాటు విద్యాసామగ్రి అమ్మకాలు జరిపితే ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలి. జీఎస్టీ చెల్లించాలి. అయితే జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలన్నీ ట్రేడ్ లైసెన్సు లేకుండా జీఎస్టీ చెల్లించకుండానే విద్యాసామగ్రి అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆయా కార్పొరేట్ స్కూళ్లు తయారు చేసుకున్న సొంత సిలబస్ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలపై ఆయాపాఠశాలల పేర్లు ముద్రించుకుంటున్నారు. ఆ విధంగా పేరు ముద్రిస్తే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నింటినీ బేఖాతరు చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న కార్పొరేట్ స్కూళ్లు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు దోచేస్తున్నాయి.

ఎల్‌కేజీ నుంచే ఫీజుల వసూళ్లు

ఎల్‌కేజీ నుంచి పదోతరగతి వరకు విద్యనందించే ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పలు పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. తొలుత అడ్మిషన్ ఫీజు, స్కూలు ఫీజు ట్యూషన్ ఫీజు, ట్రాన్స్‌పోర్టు ఫీజు, లైబ్రరీ ఫీజు, క్రీడా సామగ్రి ఫీజు ఈ విధంగా పలు రూపాల్లో ఎల్‌కేజీ స్థాయి నుంచే లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం 1, 42 జీవోలను జారీ చేసింది. అయితే ఆ జీవోలను లెక్కచేయని పాఠశాలల యాజమాన్యాలు తమ ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్నాయి. తరగతుల వారీగా ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ప్రకటించాలన్న నిబంధనను తుంగలో తొక్కాయి. కార్పొరేట్ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.30 నుంచి రూ.70 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు రూ.15 వేల నుంచి రూ.25 వేలు వసూలు చేస్తుండగా 6 నుంచి 10వ తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు.

పుస్తకాలు, విద్యాసామగ్రి విక్రయాలు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎటువంటి విద్యాసామగ్రి, పాఠ్యపుస్తకాలు విక్రయించరాదు. ఆ నిబంధనను పట్టించుకోని నిర్వాహకులు యథేచ్ఛగా పుస్తకాలు, విద్యాసామగ్రిని బుక్ షాపు తరహాలో విక్రయాలు సాగిస్తున్నారు. నోట్ బుక్‌లపై తమ పాఠశాల పేర్లతో ముద్రించి విక్రయిస్తున్నారు. అలాగే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు సొంత సిలబస్‌తో పుస్తకాలను అంటగడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు పుస్తకాలు, విద్యాసామగ్రి కోసం రూ.3 వేల నుంచి రూ.8 వేలు, 6 నుంచి 10వ తరగతి పుస్తకాల కోసం రూ.10 వేల నుంచి రూ.15 వేలు, ప్రైవేటు పాఠశాలలో రూ.8 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఇవేకాక అడ్మిషన్ పేరుతో కార్పొరేట్ పాఠశాలలో రూ.3వేల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తుండగా ప్రైవేటు పాఠశాలలో రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్టులు కిట్టుగా రూపొందించి విక్రయిస్తున్నారు. అలాగే కొన్ని పాఠశాలలో సిబ్యాట్, ఐకాన్, ఈటెక్నో, మెడికాన్, జేఈఈ శిక్షణ పేరుతో అదనపు డబ్బులు రాబడుతున్నారు. సెంట్రల్ సిలబస్ బోధించే పాఠశాలలో ఫీజులు మరింత ఎక్కువగా ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులైనా అధిక ఫీజులపై విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేసినా విద్యాశాఖాధికారుల్లో చలనం కలగడంలేదు. దీనికి తోడు.. సామాన్య శాస్త్రం, చరిత్ర వంటి పాఠ్యాంశాలకు ప్రాధాన్యత తగ్గించి ఐఐటీ ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక సిలబస్ తయారు చేస్తున్నారు. దీంతో చరిత్ర, భౌగోళిక శాస్త్రానికి సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన లేకుండా పోతోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



1st - AP B-Grade Beta State Primary FL Telugu Syllabus KIT (2024-25)

కడపలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో 1వ తరగతి విద్యార్థికి ఇచ్చిన పుస్తకాలు, విద్యాసామగ్రి

తనిఖీలు చేస్తాం..



పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రొద్దుటూరు డివిజన్ వ్యాప్తంగా వివిధ పాఠశాలలపై ఫిర్యాదులు వస్తుండడంతో అక్కడికి వెళుతున్నాం. నిత్యం ఇతర మండలాలకు పర్యటించాల్సి వస్తోంది. త్వరలోనే పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు, పుస్తక విక్రయాలు, విద్యాసామాగ్రి విక్రయాలపై చర్యలు తీసుకుంటాం.

- క్రిష్ణప్ప, ఉప విద్యాశాఖాధికారి

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం

● ఇక్కడి అవార్డులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం ● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) జూన్ 29 : నేషనల్ మెగా లోక్అదాలత్‌లో కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవడం వలన సత్వర న్యాయం పొందడంతో పాటు డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చని డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో శనివారం నేషనల్ మెగా లోక్అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలు పడదన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమైన వ్యాజ్యాలలో న్యాయస్థానానికి చెల్లించిన రుసుము తిరిగి చెల్లించేస్తారన్నారు. లోక్అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇప్పటికే కోర్టులలో దాఖలై విచారణకు వేచి ఉన్నవే కాక కోర్టులో దాఖలు కాని సమస్యలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం చేసుకోవడం వలన వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు చెడవన్నారు. లోక్ అదాలత్‌లో మొదటి, నాల్గవ, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దినబాబు, షేక్ ఇంతియాజ్, ఆయా కోర్టుల జడ్జిలు ఎస్.ప్రవీణ్‌కుమార్, కె.ప్రత్యూష కుమారి, జె.హేమస్రవంతి, జె.నందిని, కె.భార్గవి, కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గురప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

2190 కేసులకు అవార్డులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో 2190 కేసులను పరిష్కరించి అవార్డులు ఇచ్చామని, వీటికి సంబంధించి రూ.7,57,35,591 మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించామని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. లోక్అదాలత్‌కు వచ్చిన కేసుల పరిష్కారానికి జిల్లా కోర్టు ఆవరణలో 6, ప్రొద్దుటూరు కోర్టులో 4, రాయచోటి కోర్టులో 4, బద్వేల్ కోర్టులో 2, రాజంపేట కోర్టులో 1, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు కోర్టులలో ఒక్కొక్క బెంచ్ చొప్పున ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టులోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో నిర్వహించిన నేషనల్ మెగా లోక్అదాలత్‌లో ఎంవీఓపీ నెంబర్ 415/2019 కేసులో వాది అయిన జె.అమ్మనికి ప్రతివాది అయిన బజాజ్ అలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీ రాజీ అయ్యారన్నారు. బాధితురాలికి రూ.49 లక్షల చెక్కును అందజేశారన్నారు.



లోక్అదాలత్‌లో అవార్డు పొందిన కేసుకు సంబంధించి మెగా చెక్కును అందిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి తదితరులు

రేపే పెన్షన్ల పండుగ

● సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ

● వృద్ధులు, వితంతువులకు ఒకేసారి రూ.7వేలు అందజేత



(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన పింఛను పెంపు హామీ సోమవారం అమలు కానుంది. జూలై 1వ తేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు అందించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 1వతేదీనే ఏప్రిల్, మే, జూన్ నెలల డబ్బు మూడు వేలు కలుపుకుని జూలై నెలకు సంబంధించిన రూ.4వేలతో కలిపి రూ.7వేలు పొందుతుండడంతో పెన్షనర్ల లో హర్షం వ్యక్తమవుతోంది. పింఛన్ల పంపిణీలో కూటమి నేతలు పాల్గొననున్నారు.

రూ.178 కోట్లు పంపిణీ

జిల్లాలో అన్నిరకాల పింఛన్లు 2,65,774 ఉన్నాయి. జగన్ హయాంలో వీరికి పింఛను రూ.3వేలు ఇచ్చేవారు. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పింఛను రూ.4వేలు ఇస్తామని అదీ కూడా ఏప్రిల్ నుంచే పెంపు వర్తిస్తుందని ప్రకటించారు. ఇందుకు తగ్గట్లుగానే ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు జూలై నెల రూ.4వేలు కలుపుకుని మొత్తం రూ.7వేలు అందించనున్నారు. జిల్లాలో 644 గ్రామ, వార్డుసచివాలయాల పరిధిలో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రూ.178 కోట్ల 38 లక్షలా 37 వేల నగదు డ్రా చేసి ఆయా సచివాలయాల పరిధిలోని పోలీసుస్టేషన్లలో భద్రపరచారు. సోమవారం ఉదయం 5గంటలకే పింఛన్ల పంపిణీ మొదలుకానుంది. తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. 50 మందికో సచివాలయ సిబ్బంది పింఛను పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. 30వ తేదీ ఆదివారం కావడంతో శనివారమే డబ్బులు బ్యాంకు నుంచి డ్రా చేసుకుని సిద్ధంగా ఉండాలని ఆదేశాలు రావడంతో.. ముందస్తుగానే ఎంతమందికి పంపిణీ చేయాలన్న దానిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు లెక్కలు కట్టి తెచ్చారు. దివ్యాంగులకు జగన్ ప్రభుత్వం రూ.3వేలు ఇస్తుండగా చంద్రబాబు వారికి రూ.6వేలు చేశారు. పెరాలసిస్ ఇతర వ్యాధులకు గురై మంచాలకు పరిమితమైనవారికి రూ.5వేలు ఇస్తున్న పెన్షన్‌ను రూ.15వేలకు పెంచారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.5వేలు ఇచ్చే పింఛన్‌ను ఏకంగా రూ.10వేలు చేశారు. పింఛను పెంపుతో వృద్ధులు, వితంతువులు ఇతర పింఛనుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆక్రమించి.. అడ్డగోలు నిర్మాణాలు

● వైసీపీ ప్రభుత్వంలో సాగించిన అక్రమాలు

● జేబులు నింపుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారి

● ఎమ్మెల్యే వరద కూల్చేయమన్నా..

● మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు, జూన్ 29: వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ప్రొద్దుటూరులో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. స్వయంగా అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి అండతో వారి కార్యకర్తలు, కౌన్సిలర్లు ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉన్నా కాలువ స్థలం ఉన్నా.. దానిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు సాగించారు. పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు అప్పట్లో ఏ చర్యలు తీసుకోకపోవడంతో ఆ నిర్మాణాలు పూర్తయ్యి వాటిని అద్దెలకు ఇచ్చుకున్నారు. ప్రభుత్వం మారింది. వాటిని తొలగించాలని ఎమ్మెల్యే వరద ఆదేశించినా అధికారులు ఇంకా చర్యలు తీసుకోకపోవడం విశేషం.

కాలువను ఆక్రమించి.. వాణిజ్య గది నిర్మాణం

వైసీపీకి చెందిన కౌన్సిలర్ మైదుకూరు రోడ్డులోని ఇందు ట్రావెల్స్ పక్కన ఉన్న కాలువ స్థలాన్ని ఆక్రమించి నాలుగేళ్ల క్రితం వాణిజ్యగది నిర్మాణం చేపట్టాడు. అప్పటి మున్సిపల్ కమిషనర్ రాధ ఈ గది నిర్మాణం జరపకుండా కొద్ది రోజులు నిలిపారు. ఆ తరువాత అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఒత్తిడితో ఆ నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గది నిర్మాణం పూర్తయింది. ఈ నాలుగేళ్లుగా ఆ వాణిజ్యగది నుంచి లక్షలాది రూపాయలు అద్దె వసూలు చేసుకున్నారు. ఇందులో టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్లు సైతం అందినట్లు పెద్దఎత్తున ప్రచారం సాగింది. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చివేయమని వారం కిందట అధికారుల సమీక్షా సమావేశంలో ఆదేశించారు. నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని ఏసీపీ మునిరత్నం జవాబు చెపితే ఎమ్మెల్యే ఆగ్రహించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడానికి నోటీసులు ఇచ్చి వాడిని కోర్టుకు వెళ్లమని నీవే సలహా ఇస్తావా అని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు అవినీతికి పాల్పడకుండా పనిచేయాలని లేదంటే ఏసీబీకి పట్టించి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

రచ్చబండను ఆక్రమించి.. రెండంతస్తుల నిర్మాణం

పట్టణంలోని నడింపల్లెలో తత్తారు పిండి మిషన్ దగ్గర రచ్చబండ స్థలాన్ని ఆక్రమించి ఏకంగా రెండంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టారు. వైసీపీ నేతల అండతో ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు పబ్లిక్‌గా రోడ్డుమీద ఉన్న స్థలాన్నే ఆక్రమించి ఏకంగా రెండు అంతస్తులు నిర్మించినా టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రపోతున్నారు. టౌన్ ప్లానింగ్‌లో ఉన్న ఓ అవినీతి అధికారి తీరుతో పట్టణంలో అక్రమ కట్టడాల పెద్ద ఎత్తున వెలిశాయి. అంతేకాకుండా వైసీపీ నేతలతో అంటకాగి పనిచేసిన ఆ అధికారి హయాంలోనే ఏకంగా మున్సిపల్ స్థలాలు సైతం ఆక్రమణకు గురయ్యాయి. అందులో పెద్ద ఎత్తున నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ అధికారి అవినీతిపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విచారణ జరిపిస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యే స్వయంగా ఆ అక్రమ నిర్మాణాలను తొలగించమని ఆదేశించి రోజులు గడుస్తున్నా ఇంతవరకు టౌన్ ప్లానింగ్ అధికారులలో చలనం లేదు.



నడింపల్లెలో రచ్చబండ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రెండంతస్తుల నిర్మాణం



మైదుకూరు రోడ్డులో కాలువను ఆక్రమించి నిర్మించిన గది

అక్రమ నిర్మాణాలు కూల్చుతాం..

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చెప్పిన అక్రమ కట్టడాలను కచ్చింగా కూల్చుతాం. మున్సిపల్ స్థలాలను పరిరక్షిస్తాం. ఇంకా ఎక్కడెక్కడ మున్సిపల్ స్థలాలు ఆక్రమణలో ఉన్నాయో సర్వేచేయిస్తున్నాం. వాటన్నింటిని కాపాడుతాం.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

1వ తేదీనే పింఛన్లు వంద శాతం పంపిణీ చేయాలి

● కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వం జూలై1 వతేదీన అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వంద శాతం పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. సీఎస్ కాన్ఫరెన్సు ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1 వ తేదీన పింఛన్ల పంపిణీకి అన్ని విధాల సన్నద్ధం కావాలని, ఉదయం 6 గంటల నుంచి కచ్చితంగా పంపిణీ మొదలు కావాలని ఆదేశించారు. నియోజకవర్గ అధికారులు పింఛన్ల పంపిణీని ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేశ్‌కుమార్

మనీరత్నమా వేటు తప్పదు


మున్సిపల్ సమావేశంలో ఏసీపీ మునిరత్నంను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


సమావేశంలో అధికారుల తీరును వివరిస్తున్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి

- టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అవినీతిపై వాడీవేడి చర్చ
- కౌన్సిలర్లు చెబితే అధికారులు స్పందించాలి
- అధికారులు, సిబ్బంది మందగించారు
- తీరుమార్చుకోకుంటే వేటు తప్పదు
- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 29: మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం మనీరత్న మయ్యాడని, ఆయన అవినీతిపై కౌన్సిల్ సమావేశంలో వాడీ వేడి చర్చకు దారితీసింది. డబ్బే పరమావధిగా పనిచేస్తున్నాడని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ఫలితంగా పట్టణంలో విచ్చలవిడిగా ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని వారు ఆరోపించారు. దీంతో నీ అవినీతి లెక్కలు తేలే వరకూ ఎక్కడికీ పోలేవని ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కౌన్సిల్ సమావేశానికి మొదటిసారి హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మునిరత్నంను తీవ్రంగా హెచ్చరించారు. సమావేశం వివరాల్లోకెళితే...

శనివారం ఉదయం చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాషా, మహ్మద్‌గౌస్, జంబాపురం వెంకటలక్ష్మీ, చింతకుంట సరిత మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం కౌన్సిలర్లకు సరైన విలువ ఇవ్వడంలేదని విమర్శించారు. ఎవరి ఫోన్ ఎత్తడు, వార్డులో జరిగే అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోగా వారికే ఎలా కట్టుకోవచ్చో సలహాలు ఇచ్చితన జేబులు నింపుకొంటున్నాడని ఆరోపించారు. ప్రతి వార్డుకు ప్లానింగ్ సెక్రటరీలున్న పట్టణంలో వందలాది అక్రమ కట్టడాలు, ప్లాను లేకుండా, విరుద్ధంగా కట్టినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ 'మునిరత్నం ఇప్పటికే నీవు నెల్లూరులో అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి పట్టుబడి కేసులు ఎదుర్కొంటున్నావు. ఇంకా నీ తీరులో మార్పు రాలేదు. నిన్ను ఎక్కడికీ బదిలీ చేయకుండా నీవు చేసిన అక్రమాలన్నింటిపై చర్యలు తీసుకోనిదే నిన్ను పంపనని' ఆగ్రహిస్తూ తీవ్రంగా హెచ్చరించారు. కౌన్సిలర్లు ఇచ్చే ఏ ఫిర్యాదుకైనా అధికారులు, సిబ్బంది స్పందిచాలన్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకునే ప్రతి ఉద్యోగీ జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. చాలా మంది అధికారులు సిబ్బంది మందగించి నిర్లక్ష్యంగా వున్నారని తీరు మార్చుకోకపోతే వేటు తప్పదన్నారు. మున్సిపాలిటీలో చేసిన పనులు నాసిరకంగా వున్నాయని, వాటన్నింటినీ స్వయంగా పరిశీలిస్తానన్నారు. మోడంపల్లెలో నిర్మించే అర్బన్ హెల్త్‌సెంటరుకు ఇసుక లేదని, నిధులు రాలేదని అందువల్ల కాంట్రాక్టర్ పనులు చేయలేకపోయాడని ఆ పని రద్దు చేసి మళ్ళీరేట్లు పెంచి పనులు పెట్టడంలో మతలబువుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రొద్దుటూరులో ఇసుక దొరకని పరిస్థితే లేదన్నారు. ఇదంతా రేట్లు పెంచుకుని అడ్డంగా సంపాదించుకోవడానికే ఎత్తన్నారు. ప్రజా సమస్యలు ఏమున్నా సత్వరం పరిష్కరించేలా అధికారులు కమిషనర్ చొరవతో పనిచేయాలన్నారు. సమావేశంలో 7 అంశాల అజెండాపై చర్చించారు. ఇందులో ప్రధానంగా గార్బేజ్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్స్‌కు స్థలాలు లేకపోవడం వలన రద్దు చేయడంపై ఎమ్మెల్యే అభ్యంతరం పెట్టారు. స్థలాలు చూసి ప్రజల కోసం ఏర్పాటు చేయడంపై అవగాహన పెంచి వాటిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ ముక్తియార్, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మొదటిసారి కౌన్సిల్ సమావేశానికి హాజరవడంతో ఆయనకు మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, కౌన్సిలర్లు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశానికి వన్‌టౌన్, ట్రాఫిక్ సీఐలు శ్రీకాంత్, యుగంధర్ ఎస్ఐ హైమావతి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు దాటుతూ వ్యక్తి మృతి


వెంకటరమణ మృతదేహం

చెన్నూరు, జూన్ 29: మండలంలోని హైవేపై పాత టోల్‌గేటు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవరు కంచెం వెంకటరమణ (54) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు ఎర్రగుంట్ల వాసి వెంకటరమణ తిరుపతి నుంచి దాల్మియా కర్మాగారానికి సిమెంటు మెటీరియల్ తీసుకెళ్లేవాడు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి బయల్దేరి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత నిద్ర రావడంతో పాత టోల్‌గేటు వద్ద లారీని నిలిపి హోటల్‌కు వెళ్లి టీ తాగి తిరిగి లారీ ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా కడప వైపు వెళ్లే ఏపీ 39 ఎస్ఎన్ 3712 నెంబరు కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. కాగా ఇటీవల ఓ మహిళ ఆమె మరిది కుమారుడు ఇదే చోట రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీనికి ప్రధాన కారణం చీకటి పడిన తరువాత అక్కడ లైట్లు లేకపోవడం, విద్యుద్దీపాలు లేకపోవడం ప్రధానకారణమని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

చస్తున్నా మారరా... !

పాత టోల్‌గేటు ప్రాంతంలో లైట్లు లేవనే విషయం పలుమార్లు పత్రికల్లో రావడం, హైవే అధికారులకు కార్పొరేషన్ వారికి చెప్పినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇంకా ఎన్ని ప్రాణాలు బలి కావాలని మండల ప్రజలు, వాహనాల్లో రాకపోకలు సాగించేవారంతా మండిపడుతున్నారు. ఇటీవలే ఓ మహిళ, ఆమె మరిది కుమారుడు బస్సు ఢీకొనడంతో అదే ప్రాంతంలో మృతి చెందగా ఇప్పుడు మరో నిండు ప్రాణం బలైంది. పేద లారీ డ్రైవరు మృతిచెందితే ఆ కుటుంబానికి దిక్కెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయాలు పక్కన పెట్టండి : ఎమ్మెల్యే

- అభివృద్ధి కోసం పరస్పర సహకారం అవసరం
- ఎవరు తప్పు చేసినా జగన్ గతే పడుతుంది


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, జూన్ 29: రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధికి సహకరించాలని కౌన్సిల్ సమావేశంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగుంట్ల నగరపంచాయతీ సమావేశంలో చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం బాగా అభివృద్ధి చేసేందుకు అందరిసహకారంతో ముందుకెళదామన్నారు. రాజకీయలుంటే బయట చూసుకోవాలని, అభివృద్ధి గురించే ఇక్కడ మాట్లాడదామని ఆయన పాలక మండలికి సూచనలిచ్చారు. ఎర్రగుంట్లలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య, ఇతర సమస్యలపై శాఖల వారీ సమీక్షించారు. తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. గండికోట నుంచి వచ్చే స్కీం గురించి చర్చించారు. ముందుగా నగర పంచాయతీలో పైపులైన్ ప్రక్రియ మొదలుపెట్టాలన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో అక్కడే మాటాడారు. గండికోట స్కీం వచ్చిన తర్వాత ప్రస్తుత పైపులైన్లకు కనెక్షన్ ఇచ్చే వసతిపై ఆయన చర్చించారు. డ్రైనేజీ వ్యవస్థ బాగుచేసేందుకు తీసుకో వాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. ప్రధాన డ్రైన్స్‌లోని పూడిక తీసేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను వేసేందుకు గల సాధ్యాసాధ్యాలపై, అంచనాలను తయారు చేయాలన్నారు.

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈయాక్టు వల్ల రైతులకు భారీ నష్టం జరిగేదన్నారు. సొంత భూములను కూడా రైతులు అమ్ముకోలేని పరిస్థితి వచ్చేదన్నారు. మేము తప్పు చేసినా జగన్ గతే పడుతుందని, మేము సేవకులగా పనిచేస్తామన్నారు. మొత్తం రూ.1.70లక్షల అభివృద్ధి పనులు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ఎర్రగుంట్ల చుట్టూ నేషనల్ హైవేలొస్తున్నాయని, దీనికి తోడు ఎక్స్‌ప్రెస్ హైవే కూడా పనులు జరుగుతున్నాయని ఇవి పూర్తయితే స్టీల్ ప్లాంట్, ఏసీసీ సిమెంట్, తేజ సిమెంట్స్ కూడా తెచ్చేందుకు కృషిచేస్తామన్నారు. జగనన్న కాలనీ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

గండి ఏసీగా వెంకటసుబ్బయ్య



చక్రాయపేట, జూన్ 29: రాయలసీమలో ప్రసిద్దిగాంచిన గండి క్షేత్రం సహాయ కమిషనర్‌గా వెంకటసుబ్బయ్యను నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ముకుందరెడ్డి రిలీవ్ అయి వెళ్లిపోయారు. తొలుత ఆంజనేయస్వామిని దర్శించు కున్న ఆయన గండి దేవస్థాన సిబ్బందితో సమావేశమయ్యా రు. ఆలయం అభివృద్ధిపై, డ్యూటీలపై, శ్రావణమాసోత్సవాల తీరుపై ఆరాతీశారు. ప్రధాన అర్చకులు కేసరి పూజలు చేయిం చి సత్కరించారు. అనంతరం వసతిగృహాలు, గోశాల, క్యూలై న్లు, రాజగోపురం, ప్రహరీ పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

అనాథ బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన బాబురెడ్డి (4) మృతిచెందడంతో అంత్యక్రియలను మేబిహెల్ప్‌యూ ఫౌండేషన్ చేపట్టింది. బాలుడికి తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది ఫౌండేషన్‌ను సంప్రదిస్తే ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు శనివారం సాయంత్రం హిందూ శ్మశాన వాటికలో బాలుడి మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుబహాన్, చారూన్, వెంకటలక్షుమ్మ, సుమన్, బాబు, సురేష్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

రూ.125000 జరిమానా వసూలు

కాశినాయన,జూన్ 29: అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను పట్టుకుని వారికి రూ.125000లు జరిమానా విధించినట్లు తహసీల్దారు క్రిష్ణ తెలిపారు. ఆమేరకు పట్టుబడిన ఎక్స్‌కవేటర్ సహా రెండు ట్రాక్టర్ల ఓనర్ల నుంచి జరిమానా వసూలుచేసి ఆమొత్తాన్ని శనివారం ప్రభుత్వ ఖజానాకు జమచేశామన్నారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలిస్తూ వాహనాలు పట్టుబడితే ఒక్కోవాహనానికి రూ.70 వేలు వరకూ జరిమానా విధిస్తామన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈగా ఈశన్ బాషా

కడప(రూరల్) జూన్ 29: అనంతపురం జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఈశన్ బాషాకు కడప జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జ్ ఎస్ఈగా అదనపు బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలను తీసుకోనున్నారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్ఈగా పనిచేస్తున్న వీరన్న ఉద్యోగ విరమణ చెందడంతో ఈ మార్పు చోటుచేసుకుంది.

ఎయిర్‌గన్‌తో దాడి : సీఐ

చిన్నమండెం జూన్ 29: దిగువగొట్టివీడులో పుల్లగూర శ్రీరాములు పొలం దున్నుతుండగా ఈ స్థలం మాదంటూ గురుజాల పాపారావు ఎయిర్‌గన్‌తో శుక్రవారం దాడి చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు, రాయచోటి సీఐ తులసిరామ్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాములు తలపై పాపారావు ఎయిర్‌గన్‌తో బలంగా కొట్టడంతో తలకు రక్త గాయాలయ్యాయన్నారు. గ్రామస్తులు వారించి ఎయిర్‌గన్ లాక్కోవడంతో నిందితుడు పరారీ అయ్యాడు స్థానికులు ఎయిర్ గన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. నిందితునికి నోటీసులు జారీ చేశామని, ఈ కేసు ఆయుధాల నిరోధక చట్టం కిందకి వస్తుందా లేదా యని న్యాయసలహా కోరుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం


సాత్విక మహిత యుగంధర్ యశ్వంత్ లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ సీట్లు సాధించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసిని సహా మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ అభినందించారు.

వీరన్న సేవలు అభినందనీయం

- కలెక్టర్ విజయరామరాజు

కడప(రూరల్) జూన్ 29: గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఇన్‌చార్జ్ ఎస్ఈగా వీరన్న అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. వీరన్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్‌డబ్ల్యుఎస్ శాఖలో వీరన్న వివిధ హోదాల్లో పనిచేసి మంచి గుర్తింపు, గౌరవాన్ని పొందారన్నారు. ఉత్తమ వ్యక్తిగా పనిచేసి ఏ రిమార్క్ లేకుండా యాక్టివ్‌గా పనిచేశారన్నారు. అందరితో మంచి తనంగా ఉండేవారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వీరన్న మాట్లాడుతూ తాను ఎక్కడ ఏ హోదాలో పనిచేసినా అందరి సహాయసహకారాలతో సఖ్యతగా పనిచేశానన్నారు. ప్రతి ఉద్యోగికి విరమణ అనేది సహజమన్నారు. అనంతరం వీరన్న దంపతులను జిల్లా కలెక్టర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఈఈలు, డీఈలు, ఏఈలు, శ్రేయోభిలాషులు, బంధు, మిత్రులు, ఆప్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ, హౌసింగ్ డ్వామా, ఆర్‌డబ్లుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- డీఈఓ కార్యాలయం ఎదుట పీఆర్ఎస్ వైఎఫ్ ఆందోళన



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్ర బాబు డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తమ పాఠశాలల పేర్లతో టెక్స్ట్ బుక్కులు, నోటుబుక్కులు, మెటీరియల్ ముద్రించి మార్కెట్ ధరల కంటే మూడురెట్లు అధికంగా ఎమ్మార్పీ రేట్లు నిర్ణయించి విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా నేతలు వేణు, సమీర్, చరణ్, వినో ద్, వెంకటేశ్, సాయి, చందు, అబి, శ్రీను, అబ్దుల్లా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక గంగమ్మ ఆలయం వార్షికోత్సవం




విశేష అలంకరణలో ఏరువాక గంగమ్మ అమ్మవారు - కోలాటం వేస్తున్న మహిళలు

ఎర్రగుంట్ల, జూన్ 29: శాంతినగర్‌లో వెలసిన ఏరువాక గంగమ్మ ఆలయం 27వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పసుపు, కుంకుమ్మ, అమ్మవారి ప్రతిమను పంపిణీ చేశారు. మధ్యాహ్నం సుమారు 7వేల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళల నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి మధుసూదన్‌రెడి అమ్మవారిని దర్శించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేసింది.

ప్యాక్ హౌస్ బిల్లులపై వైసీపీ నిర్లక్ష్యం

రైతులకు అందని సబ్సిడీ నిధులు • యేళ్ల తరబడి ఎదురు చూపు


మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి మైఖేల్ రాజీవ్ (ఫైల్)

సింహాద్రిపురం, జూన్ 29: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఏళ్ల గడచినా ప్యాక్‌హౌస్ బిల్లులు రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వివరాల్లోకెళితే...

ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్ పథకం కింద రైతులకు ప్యాక్‌హౌస్‌లను మంజూరు చేస్తారు. ఈ ప్యాక్‌హౌస్‌లను రైతులు పండించిన ఉద్యాన పంటలు గ్రేడింగ్ చేసేందుకు, వాటిని శుభ్రపరిచేందుకు, పండ్లను తాత్కాలికంగా నిల్వ ఉంచేందుకు ఉపయోగిస్తారు. ప్యాక్‌హౌస్ నిర్మాణానికి సుమారు రూ.4 నుంచి 5 లక్షలు ఖర్చవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రూ.2 లక్షలు మంజూరు చేస్తారు. కేంద్రం నుంచి నిధులు మంజూరైనా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు మంజూరు చేయకుండా ఏళ్ల తరబడి రైతులపై నిర్లక్ష్యం వహించింది. బిల్లుల మంజూరుపై ఉద్యానవన శాఖ అధికారులను రైతులు అడిగితే ఈ వారంలో బిల్లులు పడిపోతాయి అంటూ ఏళ్ల తరబడి కాలయాపన చేశారు. మండలంలో 20 మంది రైతులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో కొన్ని ప్యాక్‌హౌస్‌లను 2023 జనవరిలో ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి విజిట్ చేసి ఓకే చేశారు. అనంతరం 6 నెలలకు 2023 జూలై 27వ తేదీన జిల్లా ఉద్యానవన శాఖ జిల్లా అధికారి మైఖేల్ రాజీవ్ ఫైనల్ విజిట్ చేసి ఆయన ఓకే చేసినట్లు రైతులు తెలిపారు. తర్వాత సబ్సిడీ మొత్తాలు మంజూరు ప్రాసెస్ జరిగింది. కానీ రైతులకు ఇంతవరకు సబ్సిడీ మొత్తం అందిన పాపాన పోలేదు. ఏళ్ల తరబడి నిధులు ఇవ్వకుండా రైతులను అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వంపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ వడ్డీ చెల్లించడానికే సరిపోతోందని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా చర్యలు తీసుకుని రైతులకు బిల్లులు మంజూరు చేయాలని రైతులు కోరారు.

నిధులు కేటాయించకనే...

కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో రైతులకు చెల్లించాల్సిన ప్యాక్ హౌస్‌ల సబ్సిడీ మొత్తాల్లో జాప్యం జరిగింది. బడ్జెట్ అనంతరం త్వరలోనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన అధికారి

THE KADAPA DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD., KADAPA

BALANCE SHEET (Amount in Rupees)

Description	Sch	As on 31.03.2024 (Current Year)	As on 31.03.2023 (Previous Year)
Capital & Liabilities			
Capital	1	2,600,874,725	2,084,813,080
Reserves and Surplus	2	780,699,090	655,111,396
Deposits	3	5,137,830,613	4,507,996,982
Borrowings	4	21,286,060,181	17,062,076,040
Other Liabilities and Provisions	5	2,329,978,137	1,849,123,069
Total		**32,135,442,746**	**26,159,120,568**
Assets			
Cash and Balances with Reserve Bank of India	6	99,894,229	146,025,329
Balance with Banks and money at call and short notice	7	2,120,533,681	2,081,840,822
Investments	8	2,343,392,268	2,106,798,817
Advances	9	26,429,686,980	20,965,829,282
Fixed Assets	10	673,992,832	679,611,197
Other Assets	11	467,942,756	179,015,122
Total		**32,135,442,746**	**26,159,120,568**
Contingent Liabilities	12	20,573,309	19,095,967

* Significant Accounting Policies & Notes to Accounts is forming part of the Balance Sheet
Note: Previous year figures in Schedules of Balance Sheet are regrouped wherever required.

PROFIT & LOSS (Amount in Rupees)

Description	Sch	As on 31.03.2024 (Current Year)	As on 31.03.2023 (Previous Year)
Income			
Interest Earned	13	2,207,362,297	1,786,395,612
Other Income	14	105,814,262	64,513,993
Total		**2,313,176,559**	**1,850,909,605**
Expenditure			
Interest Expended	15	1,648,949,713	1,264,852,757
Operating expenses	16	260,130,925	225,064,261
Provisions and Contingencies		296,118,148	289,305,412
Total		**2,205,198,786**	**1,779,222,430**
Profit / Loss			
Net Profit / Loss(-) for the year		107,977,773	71,687,175
Profit / Loss(-) Brought forward			-68,880,157
Total		**107,977,773**	**2,807,018**
Appropriations			
Transfer to Statutory Reserves		53,988,887	1,885,965
Transfer to Other Reserves			500,000
Transfer to Govt., / Proposed dividend		16,196,666	421,053
Balance carried over to Balance Sheet		37,792,221	

NOTES ON ACCOUNTS

Date :30.05.2024
Place: Kadapa

i) SLR Investments Permanent : Gsecs: 142.04
ii) Non SLR investments (Shares) : Rs.92.30 Crores
iii) No loans issued to Directors
iv) Bank Guarantee : Rs.0.20 Crores
v) Average Cost of Deposits : 6.38 %
vi) NPAs a) Gross NPAs : Rs.68.92 Crores (2.61%)
b) Net NPAs : Rs.13.38 Crores (0.52 %)
vii) Provision for NPAs : Rs. 55.54 Crores
viii) Provision for Standard Assets : Rs. 9.06 crores
ix) Insurance premium to DICGC : Rs.0.62 Crores

for M Divakara Sarma & Co., Chartered Accountants
FRN : 000764S
Sd/- **M Divakara Sarma., M.No:029195**

For The Kadapa District Co-operative Central Bank Ltd.,
Sd/- P Rajamani., CEO(I/c)

NOTE: Financial Statements are yet to be adopted by the General Body of the Bank

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● మంత్రులకు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి వినతి

కమలాపురం రూరల్, జూన్ 29 : కమలాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం సహకరించాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పలు శాఖల మంత్రులను కోరారు. శనివారం పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల మంత్రులను విజయవాడలోని మంత్రుల క్యాంపు కార్యాలయంలో కలిశారు.మంత్రులు సత్యకుమార్, అనిత, నారాయణ,రామానాయుడులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రులను ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి కోరినట్లు ఆయన తెలిపారు.


రాష్ట్ర హోం శాఖా మంత్రి అనితతో మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి





విద్యుత్ బిల్లులు నేడూ చెల్లించవచ్చు

కడప (నాగరాజుపేట), జూన్ 29 : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సకాలంలో విద్యుత్ బిల్లు లు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

నేడు గ్రామాల వారీగా పింఛన్ పంపిణీ

వీరపునాయునిపల్లె, జూన్ 29: గ్రామాల వారీగా జూలై 1న పింఛన్ నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ పులిరాంసింగ్ తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలలోని వితంతువులు, వికలాంగులు, వృద్ధులు, దివ్యాంగులు, మత్స్యకారులకు పింఛన్‌ను అందించనున్నామన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం

● ఆర్పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 29: కడప నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామక్రిష్ణ నగర్‌లో ఆర్పీపీ ప్రతినిధులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప మేయరు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ డివిజన్‌లోనే ఇలా ఉంటే నగరంలో అనేక మురికివాడలు ఉన్నాయని, వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ఎస్ఐని తక్షణమే సస్పెండ్ చేయాలి

కడప టూటౌన్ ప్రాంతంలో దౌర్జన్యాలు జరుగుతున్నా పట్టించుకోని ఎస్ఐని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆర్పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండీబజారు వీధిలో అల్లరి మూకలు చేసిన దాడిలో గాయపడిన శంషావలి రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆయన పరామర్శించారు.

నారా లోకేశ్‌ను కలిసిన అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 29 : విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు కలిశారు. లోకేశ్‌ను ఘనంగా సత్కరించారు.

లోకేశ్‌ను కలిసిన ఆరిఫుల్లా

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29 : మంగళగిరిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా కలిశారు. లోకేశ్‌ను సత్కరించారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ స్థాపనకు కృషి చేయాలి


శ్రీనివాసరెడ్డి, మాధవీలను సన్మానిస్తున్న ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత అంబారపు వెంకటేశ్వర్లు తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29 : కడప నగరంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ స్థాపనకు కృషి చేయాలని ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు కోరారు. శనివారం కడప నగరం మరాఠావీధి శాంతాబాయి కల్యాణ మండపంలో సకల మరాఠా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌రావు, రామక్రిష్ణరావు, నరేష్, వీరేంద్రరావు, రవిశంకర్‌రావు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనరుగా మాణిక్యరాజ్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29 : ఏబీవీపీ జిల్లా కన్వీనరుగా మాణిక్యరాజ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. తిరుపతి సెవెన్‌హిల్స్ కళాశాలలో ఈనెల 23 నుంచి 26 వరకు జరిగిన శిక్షణ కార్యక్రమాల అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాణిక్యరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను ఇచ్చిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈఓ నారాయణకు సన్మానం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 29 : కడప నగరం ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఎంఈఓ నారాయణను ఎంఈఓ 2 ఇర్షాద్ అహ్మద్, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సిబ్బంది సహాయ సహకారాలు ఎప్పటికీ మరువలేనిదన్నారు. తనకు సహకరించినట్లే ప్రస్తుతం ఉన్న ఎంఈఓలకు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ సత్యనారాయణకు...

సింహాద్రిపురం, జూన్ 29: మండలంలోని పైడిపాళెం గ్రామ వీఆర్‌ఓ సీవీ సత్యనారాయణరావు సేవలు ప్రశంసనీయమని డిప్యూటీ తహసిల్దార్ శిరీష పేర్కొన్నారు. శనివారం సింహాద్రిపురం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్షావలి, పద్మావతి, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'పాఠశాలల్లో సమస్యలుంటే చెప్పండి'

చెన్నూరు, జూన్ 29: పాఠశాల్లో సమస్యలుంటే చెప్పాలని వాటిని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని శనివారం టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్ రెడ్డి, ఎంఈఓ గంగిరెడ్డి, చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభయ్యతో అన్నారు. మౌలిక వసతులు, నాన్ టీచింగ్ స్టాఫ్ కొరత ఉన్నా తెలపాలన్నారు. బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం పద్మనాభయ్య మాట్లాడుతూ ఇప్పటికే తెలుగు, హిందీ ఉపాధ్యాయుల కొరత ఉందని, ఇంగ్లీషు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారని,ఈ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మూడేళ్లుగా నైట్ వాచ్‌మెన్ లేరన్నారు.

హెలెన్‌కెల్లెర్ స్థానం చిరస్మరణీయం

పులివెందుల,జూన్ 29: ఎందరో అభాగ్యుల జీవితాలలో వెలుగులు ప్రసాదించిన హెలెన్ కెల్లర్ చిరస్మరణీయురాలని రిటైర్డ్ టెలికం డివిజనల్ ఇంజనీర్ బైర్రాజు వెంకట సుబబ్బారావు పేర్కొన్నారు.శనివారం హెలెన్ కెల్లర్ స్మారకోత్సవాలను పురస్కరించుకొని వికలాంగుల కార్యాలయంలో దివ్యాంగులకు వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు.

శ్రావణమాసోత్సవాలు వైభవంగా జరగాలి


అధికారులతో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

చక్రాయపేట, జూన్ 29: గండి క్షేత్రంలో శ్రావణమాసోత్సవాలు ఈ ఏడాది అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని చక్రాయపేట మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి గండి ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్యను కోరారు. శనివారం మహేశ్వరరెడ్డి గండి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులను సమావేశపరిచి సలహాలు, సూచనలతో పాటు గండిలో చేపట్టాల్సిన పనుల గురించి లిస్టు తయారు చేస్తే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రతిఏటా శ్రావణమాసోత్సవాలలో టీటీడీ వారు గండి ఆలయంలో కళావేదిక, పారిశుధ్య సామగ్రి పంపిస్తారని, ఈ ఏడాది కూడా అలా చేసేందుకు మహేశ్వరరెడ్డిని కోరగా నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అలాగే అద్భుతంగా కటౌట్లు, ప్రసాదాలు, క్యూలైన్లు, బారికేడ్లు, చలువపందిళ్లు తదితర ఏర్పాట్లు చేసేందుకు కృషిచేయాలన్నారు. గండి మాజీ చైర్మన్ వెంకటస్వామి, టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పట్టెం అశోక్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, కొనసాని శంకర్‌రెడ్డి, గంగవరపు ప్రసాదరెడ్డి, చదివే సిద్దారెడ్డి, గంగిరెడ్డి, కొండారెడ్డి, యువ నాయకుడు అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పులివెందుల టౌన్, జూన్ 29: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు కమిషనర్ రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ఎక్కడైనా పైప్‌లైన్ల మరమ్మతులు, కలుషిత నీరు, అపరిశుభ్రత పరిసరాలు తదితర వాటిపై ఫిర్యాదుచేయవచ్చు అన్నారు. అలాగే మంచినీటి పైప్‌లైన్ల మరమ్మత్తులు, రెగ్యులర్ తాగునీటి క్లోరినేషన్ చేసే చర్యలను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో నీటి కాలుష్యం ద్వారా అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు














టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వినతుల వెల్లువ

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29 : టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి శనివారం వివిధ ప్రజాసంఘాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడాలని, జీఓ 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీఓ 117ను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను రద్దు చేస్తామని మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని రద్దు చేసి 1 నుంచి 5 వరకు ప్రాథమిక పాఠశాలలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సీవీ రమణ, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల సమస్యలు పరిష్కరించండి: రూటా

ఉర్దూ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని రూటా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇర్షాద్, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుసేన్ డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. అలాగే ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు.

గౌసనగర్‌లో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 29 :గౌసనగర్‌లో శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు సజ్జాద్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. టీడీపీ మైనార్టీ నాయకులు జిలానీబాషా, ఖాజాపీర్, షహీమిర్, బాబు, మస్తాన్, రఫి పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు జీవన భృతి కల్పించాలి

కడప (మారుతీనగర్), జూన్ 29 : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు జీవనభృతి కల్పించేలా సీఎం చంద్రబాబునాయుడికి చెప్పి ఒప్పించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఎల్.రఘునాథరెడ్డి కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిని శనివారం ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు.

తారు రోడ్డును వాడుకలోకి తీసుకురావాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 29 : కడప నగరంలోని బుగ్గవంక ప్రొటెక్షన్ గోడ వెంబడి వేసిన తారు రోడ్డును వాడకలోకి తీసుకురావాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మునెయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లింగన్న, జిల్లా నాయకులు ఈశ్వరయ్య, ఇన్సాఫ్ జిల్లా నాయకులు దస్తగిరి డిమాండ్ చేశారు. శనివారం వారు ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుగ్గవంక ప్రొటెక్షన్ గోడ వెంబడి కాల్వ, తారురోడ్డును రవీంద్రనగర్ నాగరాజుపేటప్రాంతాల్లో నిర్మించినందుకు కాంట్రాక్టరుకు నగరపాలక సంస్థ ద్వారా రూ.2కోట్లు చెల్లించినా పనుల్లో పురోగతి లేదన్నారు. కాంట్రాక్టరుపై ఒత్తిడి తీసుకువిచ్చ తారురోడ్డు పూర్తి చేసి ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరారు.

మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రిక్ ఆటోలు


వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి


కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29 : కడప వినాయక్‌నగర్ హరూన్ ఆటో మోటల్స్ షోరూములో శుక్రవారం బజాజ్ ఆటో ఎలక్ట్రానిక్ వాహనాలను మార్కెట్లోకి విడుదల చేశారు. రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు చేతుల మీదుగా బజాజ్ ఎలక్ట్రిక్ ప్యాసింజరు, కార్గో 2 మోడల్స్‌ను ఆవిష్కరించారు. ప్రతి చార్జీకి తమ అత్యుత్తమమైన మైలేజీ, 183 కేఎంపీహెచ్ కలిగి ఉన్న ఈ వాహనాల ప్రత్యేకతను తెలిపారు. బజాజ్ సంస్థ కార్తికేయన్, చంద్రశేఖర్, హరున్ ఆటోమొటివ్స్ మేనేజింగ్ డైరెక్టరు ఎస్‌బి అహ్మద్‌బాషా, ఆసిఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మోడాలలో టీడీపీ నేతల అన్నదానం

చెన్నూరు, జూన్ 29 : కమలాపురం నియోజకవర్గంలో పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంపై ఆ పార్టీ శ్రేణులు మండలంలోని మోడాల గ్రామంలో శనివారం రాత్రి అన్నదానం చేశారు. గ్రామ నేత విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భవానీ ఆచారి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, కె.రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ చదివే విద్యార్థినులకు హాస్టల్ ఏర్పాటు చేయాలి

వేంపల్లె,జూన్ 29: వేంపల్లెలో ఇంటర్‌మీడియట్ చదివే విద్యార్థినులకు హాస్టల్ ఏర్పాటుచేయాలని ప్రజలు శనివారం వేంపల్లె మండల టీడీపీ ఇన్‌చార్జి రఘునాథరెడ్డికి వినతిపత్రం అందించారు. హాస్టల్ లేని కారణంగా ఇంటర్ చదివేందుకు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌ను కలిసిన పలువురు



జమ్మలమడుగు, జూన్ 29: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో శనివారం పలు శాఖల అధికారులు, నియోజకవర్గంలోని దళిత నాయకులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, అలాగే జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఏఎంవో వెంకటరెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు కలిశారు. అలాగే జిల్లాలోని ఏపీఎన్జీవో నాయకులు, జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, కోశాధికారి నిత్యపూజయ్య, తాలూకా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి రఘునాథరెడ్డి, పద్మనాభం, తదితరులు కలిసి మాట్లాడారు. అలాగే జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ నాయకుడు వై.చిన్నయ్య నాయకులు కలిశారు.

జీవితాంతం గుర్తుండేలా అభివృద్ధి చేస్తా

● మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



పుట్టా సుధాకర్ యాదవ్‌ను సన్మానిస్తున్న మెప్మా సిబ్బంది


మైదుకూరు, జూన్ 29 : 13 ఏళ్ళుగా ప్రజలు పడే కష్టాలు చూశా, ఎమ్మెల్యేగా గెలిపించారు. ఇక చూడండి జీవితాంతం మీరందరూ గుర్తు పెట్టుకునేలా అన్ని విధాలుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీ ఆవరణలో ఆర్టీసీ కార్మికులు, మెప్మా సిబ్బందితో పాటు పలు ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు ఆయనకు సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరందరూ గుర్తు పెట్టుకునేలా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. కాగా మెప్మా సిబ్బందికి జీత భత్యాలు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకపోవాలని పుట్టాను కోరారు. మేధా విద్యాసంస్థల చైర్మెన్ చెన్నంశెట్టి నరసింహులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై దృష్టి పెట్టాలి..: మైదుకూరులో గోదాముల్లో డిగ్రీ కళాశాల నడుస్తోందని వాటిపై దృష్టి సారించాలని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ పి.నారాయణరెడ్డి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి చేరుకొని అధ్యాపకులతో కలసి అభినందనలు తెలిపారు.

పుట్టాను కలసిన బీజేపీ నాయకులు..: స్థానిక బీజేపీ నాయకులు బీపీ ప్రతాప్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, కూశెట్టి వెంకటరమణ శనివారం ప్రొద్దుటూరులోని పుట్టా నివాసంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కలసి మైదుకూరు అభివృద్ధిపై చర్చించారు. మిడుతూరు వెన్నపూస ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

మైలవరం కాలువలో పూడిక తొలగించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29: మైలవరం కాలువలో పూడిక వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పూడిక తొలగించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామాంజనేయరెడ్డికి స్థానికులు జీసీ పుల్లయ్య, కుళాయిరెడ్డి, సుధాకర్‌యాదవ్ శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపవరం పంచాయతీ ద్వారకానగర్, ఆచార్యకాలనీ, శ్రీనివాసపురం మీదుగా మైలవరం కాలువ వెళుతుందన్నారు. కాలువ పూడిక తీయకపోవడం వలన పిచ్చిమొక్కలు పెరిగి మురికినీరు నిలువ ఉండి దుర్వాసన వస్తోందన్నారు. దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలువలో పూడిక తీయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య, గురివిరెడ్డి, ఓబులేసు, శ్రీను, నాగేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు తొలగింపు



జమ్మలమడుగు, జూన్ 29: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో వివిధ సమస్యలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపణలున్నాయి. అందులో భాగంగా కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీకాలువలపై గతంలో నాశిరకంగా నిర్మించిన కాలువలపై ఉన్న అడ్డంకులను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగింపు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, డీఈ బాలమల్లేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.





రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి

మైలవరం, జూన్ 29 : రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని జి.ఉప్పలపాడు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన పెద్ద కేక్‌ను భూపేశ్‌రెడ్డి కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరంపెద్దకొమెర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 1016 టెంకాయలను ఆలయంలో కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఆలయ చెర్మెన్, నాయకులు కిష్టయ్య, ప్రశాంత్, హుస్సేన్‌రెడ్డి, సంజీవ, నరసింహులు, సూర్యపెద్దిరాజు, కర్నాటి రామాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండయ్య, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే ఉత్తమమైన మార్గం

జమ్మలమడుగు, జూన్ 29: రాజీమార్గమే ఉత్తమమైన మార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో మండల శాఖ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భూతమాపురం సుబ్బారావు,భాస్కర్‌రెడ్డి ,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరి మురళీధర్‌రెడ్డి, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ లక్షుమయ్య, ఏపీపీ వీరాంజనేయులు, ఏజీపీ జాకీర్‌హుస్సేన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

490 కేసులు పరిష్కారం..: జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 490 కేసులు పరిష్కారం అయినట్లు లోక్ అదాలత్ సభ్యురాలుసంధ్య తెలిపారు.

బద్వేలు రూరల్..: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ కోరారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు.మొదటి బెంచ్‌ను సీనియర్ సివిల్ జడ్జి వై.జే.పద్మశ్రీ, రెండో బెంచ్‌ను అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి గాయత్రి నిర్వహించారు. క్రిమినల్ కేసులు 314, రూ.75,78,800లకు పరిష్కారం కాగా, 13 సివిల్ కేసులకు గాను రూ.56,31,348 మొత్తం 327 కేసులకు గాను కోటీ 32 లక్షలా 10వేల 148 రూపాయలకు పరిష్కారం అయినట్లు కోర్టువర్గాలు తెలిపాయి. జాతీయ లోక్ అదాలత్‌లో బెంచ్ మెంబర్లు ఎస్.వాసుదేవరావు, ప్రభాకర్‌రావు, ఓఎస్‌వీ ప్రసాద్,రూకల ఓబయ్య, న్యాయవాదులు, మెంబర్స్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29: విశాఖ పట్టణానికి చెందిన టాలెంట్ లెడ్ కంపెనీలో సాయిరాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 11 మంది విద్యార్థులు ఉద్యోగానికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి తెలిపారు. బీటెక్, ఎంబీఏ విద్యార్థులకు నిర్వహించిన ఎంపికలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, లీడ్ జనరేషన్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలో బీటెక్ విద్యార్థులు మౌనిక, శ్రావణి, నాగార్జున, లహరి, ఇమ్రాన్‌బాషా, కౌసల్య, జమీర్‌బాష, చంద్రప్రశాంత్, వెంకటమంజునాథ, మహమ్మద్ షమీర్, ఎంబీఏ విద్యార్థి చరణ్‌కుమార్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.3.6 లక్షల వేతనం లభిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సునీల్, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29: విద్యార్థులు నైతిక విలువతో అభ్యసించి క్రమశిక్షణ నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం గోల్డెన్ పార్కులో లేపాక్షి కళాశాల విద్యార్థులకు ఫేర్‌వెల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లోకేశ్వరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

బద్వేలు, జూన్ 29: ఒకటి, రెండు తేదీలలో కడపలో నిర్వహించే సీపీఎం పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివకుమార్ తెలిపారు. శనివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే ఈ తరగతులలో పలు సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ కార్యదర్శి శ్రీను, ముడియం చిన్ని, ఆంజనేయులు, మోక్షమ్మ, ఖైరున్‌బీ, రామలక్షుమ్మ, బాలమ్మ, బాబు, గంప సుబ్బరాయుడు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



